క్లుప్తంగా

నేటి నుంచి సాయినాథుని రథోత్సవం



కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి 3వ మహా రథోత్సవ వేడుకలను బుధవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీ ప్రభోత్సవం, 16వ తేదీ సాయంత్రం రథోత్సవం జరగనుందన్నారు.

నేడు ఇనగండ్లలో దేవర



మారెమ్మ ప్రతిమలు

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్ల ఆలయాలు, దేవతామూర్తులు, గ్రామ శివారులోని చౌడమ్మను మంగళవారం సుందరంగా అలంకరించారు. అర్ధరాత్రి అనంతరం గ్రామోత్సవం నిర్వహించి, బుధవారం తెల్లవారుజామున కుంబ కాగులను ఆలయాలకు చేర్చి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

నేడు ఆలయ భూముల వేలం

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల ఆలయాల భూములకు ఈనెల 15, 16 తేదీలలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు గ్రూప్ దేవస్థానాల అధికారి మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న శకునాల చెన్నకేశస్వామి దేవస్థానానికి చెందిన 34 ఎకరాలకు, 16న ఓర్వకల్లులోని శ్రీచెన్నకేశవ, ఆంజనేయస్వామి దేవస్థానాలకు సంబంధించిన 192 ఎకరాలను వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.2 వేలు డిపాజిట్‌తో స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం వద్దకు ఆయా రోజులలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



కొణిదేడు గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చింతచెట్టు

పాణ్యం: మండలంలో గాలి బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు భారీ వృక్షాలు సైతం నేరకొరిగాయి. కరెంట్ స్తంభాలు, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాణ్యం–బనపగానపల్లె ప్రధాన రహదారిలో ఉన్న కొణిదేడు గ్రామం వద్ద భారీ చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు వృక్షాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

టీబీ డ్యాంలో 3.4 టీఎంసీల నీరు నిల్వ

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రదాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. డ్యాంలో నీరు లేక కళ తప్పగా ఎల్లెల్సీ బోసిపోతోంది. ఆంధ్రకు సంబంధించి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాం గడిచిన నాలుగేళ్లుగా ముందస్తు వర్షాలతో జూలై ముందుగానే పూర్తి స్థాయిలో నిండి పలు సార్లు డ్యాం గేట్లు ఎత్తి నదికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో డ్యాంలో నీటి నిల్వ అడుగంటింది. ఈ ఏడాదైనా ముందస్తు వర్షాలు కురువాలని రైతులు ఎదురు చూస్తున్నారు. టీబీ డ్యాంలో మంగళవారం నాటికి 1,633 అడుగులకు గానూ 1,577.60 అడుగులతో 105,788 టీఎంసీలకు గాను 3.415 టిఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో కాగా, అవుట్ ఫ్లో 13 క్యూసెక్కులుంది.

నేటి నుంచి వేసవి వినోద సంబరాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో వేసవి వినోద సంబరాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్లు సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు కమెడియన్లు అదిరే అభి, వినోదిని, చిత్రం శీను, షేకింగ్ శేషు, అదుర్స్ ఆనంద్, ఫణిలతో కామెడీ స్కిట్స్ ప్రదర్శన ఉంటాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి వీహెచ్‌పీ శిక్షణా శిబిరం

విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మూడు ప్రాంతాల శిక్షణా శిబిరం ఈనెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ తెలిపారు. నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో జరిగే శిక్షణలో ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర, తెలంగాణ ప్రాంతాల కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. 10 రోజుల పాటు జరిగే శిక్షణలో యోగా, ఆటలు, దేశభక్తి గీతాలు, సంస్థల విధి విధానాలు నేర్పిస్తారని వెల్లడించారు.

వేసవిలో ఉష్ణ తాపాన్ని తగ్గించుకోవడానికి కొందరు ఈత కొడుతూ ఉపశమనం పొందుతుంటారు. మరికొందరు సరదాగా ఈత కొట్టడానికి ఇష్టపడుతుంటారు. అయితే ఈత కొట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు వైద్య నిపుణులు. ముఖ్యంగా ఒత్తిడి నుంచి దూరం కావడానికి.. కండరాలు బలోపేతానికి.. బరువు తగ్గడానికి ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు. రక్త ప్రసరణ బాగా జరిగి గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. శరీరాన్ని ఉత్తేజపరిచి ఉల్లాసంగా ఉండేందుకు ఉపయోగపడుంది. స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రధాన్యత ఉంటుంది.

ఉల్లాసం.. ఆరోగ్యం



- ఈత కొట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు
- ఆరోగ్యం పదిలం.. ఒత్తిడి దూరం
- స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరిస్తే విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం
- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో శిక్షణ పొందుతున్న స్విమ్మర్స్

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరికి నిత్య జీవితంలో ఈత చాలా అవసరమైంది. ఈత ద్వారా శరీరంలో ఉన్న ప్రతి కండరం కదులుతూ ఉత్తేజ పరుస్తుంది. ప్రతి ఒక్క కీలు చక్కగా పనిచేస్తూ ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంచుతాయి. మైదానాల్లో ఆడే ఆటల కన్నా ఈత కొట్టేటప్పుడు ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి. కండరాలు ఉత్తేజంగా పనిచేయడం వల్ల రక్త ప్రసరణ బాగా జరిగి గుండె సక్రమంగా పనిచేసేలా ఉపయోగపడుతుంది. ఈత కొట్టే సమయంలో పీల్చుకున్న గాలి ఊపిరితిత్తుల్లోకి పోయిన తరువాత ఊపిరితిత్తులు కూడా ఆ గాలిని స్వచ్ఛమైన ప్రాణ వాయువుగా మార్చి మన శరీర భాగాలకు సరఫరా అయ్యేలా చేస్తుంది. నిత్య జీవితంలో మనం ఉత్సాహంగా పనులు చేయడానికి ఎంతో దోహదపడుతుంది.

విద్య, ఉద్యోగాల నియామకాల్లో ప్రాధాన్యం

స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన విద్యార్థులకు నీట్, ఇంజినీరింగ్ డిగ్రీ విద్యలో ప్రాధాన్యం ఉంటుంది. ఉద్యోగ నియామకాల్లో జీఓ నెం. 74 ప్రకారం 2 శాతం రిజర్వేషన్ ఉంటుంది.

➤ డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో సుమారు 100 మంది స్విమ్మర్స్ శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించారు. ఇందులో నలుగురు నేషనల్ మెడలిస్ట్ ఉన్నారు. సౌత్ జోన్ వాటర్ పోలో నేషనలిస్ట్ ఉన్నాడు. ఇక్కడి నుంచి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, కేవీఎస్ నేషనల్స్, సౌత్ జోన్ నేషనల్స్‌కు ప్రాతినిధ్యం వహించారు. ముగ్గురు డాక్టర్స్, 10 మంది ఇంజినీర్స్ ఉన్నారు. రైల్వే, ఆర్‌టీఓ, పోస్టల్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారు.

జిల్లాలో ఈత కొలనుల వివరాలు

➤ కిసాన్ ఘాట్ సమీపంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈతకొలను ఉంది. ఇది 1973లో ఏర్పాటైంది. రాష్ట్రంలో ఉన్న అతి పెద్ద మూడు స్విమిగ్ పూల్స్ (50మీటర్స్)లో ఇది ఒకటి. ఇక్కడ రోజుకు సుమారు 500 మంది, వేసవి కాలం మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రోజుకు సుమారు 2 వేల మంది ఈత నేర్చుకోవడానికి వస్తుంటారు. 30 మంది వరకు విద్యార్థులు ఈత పోటీలకు శిక్షణ పొందుతున్నారు.

➤ కర్నూలు, నంద్యాల కేంద్రాల్లో ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఏడు ఈత కొలనులు ఉన్నాయి. డోన్ మున్సిపాలిటీ పరిధిలో ఒక స్విమ్మింగ్ పూల్ ఉంది. నాలుగు విద్యా సంస్థల్లో స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి.

➤ డీఎస్ఏ ఆధ్వర్యంలో డోన్‌లో ఈత కొలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నారు.

ఈతతో కలిగే ప్రయోజనాలు

- ➤ ఈత వల్ల రక్తపోటు, చక్కెర వ్యాధిని నియంత్రణంలో ఉంచుకోవచ్చు.
- ➤ ఏవైనా కొన్ని శస్త్ర చికిత్సలు జరిగినప్పుడు రీహేబిలిటేషన్‌కు ఈత కొట్టాలని వైద్యులు సూచిస్తారు.
- ➤ ఈత నేర్చుకోవడం వల్ల నీటి ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు.
- ➤ ఈత గుండె, ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతుంది.
- ➤ ఆత్మవిశ్వాసంతో పాటు శారీరక సామర్థ్యాలపై నమ్మకం ఉంచడానికి సహాయపడుతుంది.
- ➤ స్విమ్మింగ్ జీవితాంతం కొనసాగించగల ఆరోగ్యకరమైన చర్య.
- ➤ శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.
- ➤ ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.


ప్రవేశ వివరాలు

- డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో 6 ఏళ్లు నిండిన వారిని ఈత నేర్చుకోడానికి అనుమతిస్తారు.
- 6 నుంచి 14 ఏళ్లలోపు వారికి అడ్మిషన్ ఫీజు రూ.1000, నెలకు రూ. 500 చెల్లించాలి.
- 14 ఏళ్లు పైబడిన వారికి అడ్మిషన్ ఫీజు రూ.2000, నెలకు రూ.1000 చెల్లించాలి.

నిపుణుల సమక్షంలో ఈత నేర్చుకోవాలి

ఈత కొట్టడం వల్ల శారీరకంగా ఎంతో ఆరోగ్యంగా ఉంటాం. నిపుణుల సమక్షంలో ఈత కొలనుల్లో మాత్రమే ఈత నేర్చుకోవాలి. ఇటీవల కాలంలో ఈత నేర్చుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. తల్లిదండ్రులు పిల్లలకు ఈత నేర్పడానికి ముందుకు వస్తున్నారు. స్విమ్మింగ్ వల్ల లాభాలతో పాటు నిర్లక్ష్యంగా ఉంటే కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. తెలియని ప్రదేశంలో నీళ్లలో దిగటం ప్రమాదకరం. ఈత రానివారు సరదాగా నీళ్లలో దిగితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. **–ఎ.నక్రాజరావు, స్విమ్మింగ్ కోచ్, డీఎస్ఏ**

ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



ఈత వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కీళ్లు, ఎముకలు, కండరాలు, నరాల బలహీనత, రక్త పోటు, మధుమేహం లాంటి వ్యాధులకు చికిత్సలా ఉపయోగ పడుతుంది. స్థూల కాయం ఉన్న వారు బరువు తగ్గడానికి దోహదపడుతుంది. వ్యాధి నిరోధ శక్తి పెరుగుతుంది. రోజు గంట స్విమ్మింగ్ చేస్తే మొదటి అరగంట వ్యాయామంతోపాటు శరీరంలో నిల్వ ఉన్న గ్లూకోజ్ పూర్తిగా కరుగుతుంది. రెండో అరగంటలో కొవ్వు కరగడం జరుగుతుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా చేయగలిగింది ఈత ఒక్కటే. **–లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్**

ఆరోగ్యంగా ఉంటాం



పదేళ్ల నుంచి స్విమ్మింగ్ చేస్తున్నాను. మిగతా వ్యాయామాల కంటే స్విమ్మింగ్ ఉత్తమమైంది. నాకు బ్యాక్ పెయిన్ ఉండేది. స్విమ్మింగ్ చేడయం వల్ల తగ్గింది. నేను గర్భిణిగా ఉన్నప్పుడు కూడా 7 నెలల వరకు స్విమ్మింగ్‌కు వచ్చాను. నిత్యం ఈత కొట్టడం వల్ల స్పాండిలైటిస్, సయాటికా లాంటివి వ్యాధులు దూరం అవుతాయి. ఒత్తిడి దూరం కావడంతో పాటు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటాం. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలం. డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ నిర్వహణ బాగుంటుంది. **–డాక్టర్ చందన రాజారామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కేఎంసీ**

స్విమ్మింగ్ పూల్‌లో అన్ని వసతులు



డిస్ట్రిక్ స్విమ్మింగ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ అతి పెద్దది. ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి. స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు అయ్యింది. కలెక్టర్ అనుమతితో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ నిత్యం వందలాది మంది స్విమ్మింగ్ చేస్తుంటారు. వేసవి కాలంలో వేల సంఖ్యలో చిన్నారులు ఈత నేర్చుకుంటారు. మంచి నిపుణులతో ఈత నేర్పిస్తున్నాం. ఇక్కడి ఈత నేర్చుకున్న స్విమ్మర్స్ జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటుతున్నారు. వారికి అన్ని విధాలా డీఎస్ఏ తరుపున ప్రోత్సహిస్తున్నాం. **–బండారు భూపతి రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి**

సి.బెళగల్‌లో 84.80 శాతం పోలింగ్ నమోదు

- ఆరు కేంద్రాల్లో 90 శాతానికిపైగా పోలింగ్
- గత ఎన్నికలతో పోలిస్తే 1.5 శాతం తగ్గుదల



సి.బెళగల్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు (ఫైల్)

సి.బెళగల్: సార్వత్రిక ఎన్నికల్లో సి.బెళగల్ మండలంలో 84.80 శాతం పోలింగ్ నమోదైనట్లు మండల ఎన్నికల అధికారిణి, తహసీల్దార్ అనుపమ తెలిపారు. మంగళవారం ఆమె వివరాలను వెల్లడించారు మండలంలో పురుష ఓటర్లు 22,537, స్త్రీ ఓటర్లు 22,537 మొత్తం 44,625 మంది ఉన్నట్లు తెలిపారు. సోమవారం 49 పోలింగ్ కేంద్రాల ద్వారా పురుషులు–19,355, స్త్రీలు–18,489 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 37,844(84.80 శాతం) పోలింగ్ నమోదైందన్నారు. గుండ్రేవుల గ్రామంలోని 6వ పోలింగ్ కేంద్రం (పీఎస్)లో 91.84 శాతం పోలింగ్‌తో మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా ఈర్లదిన్నెలోని 14వ పీఎస్‌లో 91.78 శాతంతో రెండో స్థానం, సంగాలోని 2వ పీఎస్‌లో 91.49 శాతం, బ్రాహ్మణదొడ్డిలోని 163వ పీఎస్‌లో 91.15 శాతం, ఈర్లదిన్నెలోని 15వ పీఎస్ 90.03 శాతం, మరందొడ్డిలోని 187వ పీఎస్ 90.65 శాతం ఓటింగ్ నమోదయ్యాయి. అయితే కంబదహాల్ గ్రామంలోని 155వ పీఎస్‌లో 72.80 శాతం పోలింగ్‌తో మండలంలో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది.

గతంలో పోలిస్తే తగ్గిన ఓటింగ్

2019లో జరిగిన సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 1.5 శాతం పోలింగ్ తగ్గింది. గతంలో 86.29 ఓటింగ్ శాతం నమోదు కాగా ఈ ఎన్నికల్లో 84.80 శాతమే నమోదైంది.

గూడూరులో 82.87 శాతం పోలింగ్

గూడూరు: మండలంలో మొత్తం 36,864 మంది ఓటర్లకు 30,552 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ మంగళవారం తెలిపారు. 82.87 శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు.

పాణ్యం నియోజకవర్గంలో 74.44 శాతం పోలింగ్

పాణ్యం: నియోజకవర్గంలో 74.44 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులు 1,61,311 మంది, మహిళలు 1,70,321 మంది, ఇతరులు 74 మంది కలిపి మొత్తం 3,31,706 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,21,952 మంది పురుషులు, 1,24,945 మంది మహిళలు, 38 మంది ఇతరులు కలిపి మొత్తం 2,46,935 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కల్లూరులో 67శాతం పోలింగ్ నమోదు

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 67.25 శాతం పోలింగ్ నమోదయ్యింది. మొత్తం 2,11,219 మంది ఓటర్లు ఉండగా 1,42,048 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రిలాక్స్.. రిలాక్స్ !




కుటుంబ సభ్యులతో సరదాగా మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సార్వత్రిక సమరంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు దాదాపు రెండు నెలలు విరామం లేకుండా బిజీబిజీగా గడిపారు. సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం, కార్యకర్తలు, నాయకులతో సమీక్షలు.. ఇలా రోజూ ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు ఎన్నికల పైనే దృష్టి సారించారు. ప్రత్యర్థుల ఎత్తులకు పైఎత్తులు వేస్తూ.. విమర్శలను ప్రతి విమర్శలతో తిప్పికొడుతూ.. జనంతో మమేకమవుతూ.. హోరాహోరీగా ముందుకు సాగారు. సోమవారం పోలింగ్ కూడా ముగిసింది. ఇక ఫలితాలు వెలువడేందుకు ఇంకా 20 రోజుల సమయం ఉంది. ఎన్నికల బిజీ నుంచి బయటపడిన నాయకులు మంగళవారం కుటుంబీకులు, స్నేహితులు, పార్టీ కార్యకర్తలతో కాసేపు సరదాగా గడిపారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్

గడువు దాటితే ముప్పు తప్పదు

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ (బీ–24)

కర్నూలు (న్యూటౌన్): గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని, దానిని గమనిస్తుండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి..

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ–24, బీ–24 అని ఉంటే, ఆ సిలిండర్ 2024 మార్చికి ఎక్స్‌పైరీ అవుతుందని అర్థం. 24 అంకె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని గుర్తించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెలరోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

వినియోగదారుడి హక్కులు

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు.

- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు. దీంతో పాటు గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలో మీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

సిలిండర్‌కు పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

చురుగ్గా గూడూరు–కోడుమూరు రోడ్డు పనులు



చనుగొండ్ల వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

గూడూరు రూరల్: మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గూడూరు–కోడుమూరు రోడ్డు పనులు ప్రస్తుతం వేగవంతంగా జరుగుతున్నాయి. రోడ్డును బాగు చేయాలని గతంలో పలుమార్లు గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినా అభివృద్ధికి నోచుకోలేదు. ప్రజల వినతి మేరకు వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రెండు నెలల క్రితం రూ. 6.70 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు 11 కిలోమీటర్ల రోడ్డు వేయనున్నారు. ఇప్పటికే కల్వర్టు పనులను పూర్తి చేసిన అధికారులు మరో నెలలో రోడ్డు పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు వినియోగంలోకి వస్తే ప్రయాణ కష్టాలు తొలగిపోతాయని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం

గూడూరు రూరల్: ఉపాధి హామీలో కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి వేతనం అందుతుందని ఏపీఓ ఈశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని గుడిపాడులో జరుగుతున్న పనులు, కూలీల హాజరును మంగళవారం ఆమె పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి చూపుతున్నామని తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా పీల్డుఅసిస్టెంట్లు సూచించిన సమయానికి పని ప్రదేశానికి వెళ్లి నిర్ణీత సమయంలోగా పనులను పూర్తి చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతు పనులు



పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న వాటర్ వర్కర్లు.



కొట్టుకుపోకుండా అడ్డుగా వేస్తున్న ఇసుక బస్తాలు

కోడుమూరు రూరల్: కోడుమూరులో సోమవారం కురిసిన భారీ వర్షానికి హంద్రీనదికి వరదనీరు పోటెత్తింది. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే రెండు మోటార్లు మునిగిపోవడంతో పాటు పైప్‌లెన్లు కొట్టుకుపోయాయి. దీంతో పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వాటర్ వర్కర్లు మంగళవారం తెగిపోయిన పైప్‌లైన్లను పునరుద్ధరించడంతో పాటు, కొట్టుకుపోయిన పైపులైన్ల స్థానంలో కొత్తవి వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. సాధ్యమైనంత త్వరగా పైప్‌లైన్లను వేసి పట్టణంలోని కాలనీలకు తాగునీటిని సరఫరా చేస్తామని ఈఓ అజయ్‌భాస్కర్ తెలిపారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ

కర్నూలు సిటీ: పదో తరగతి సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్(ఏక్యాంపు) విద్యార్థుల కోసం మంగళవారం ఆ స్కూల్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి, ప్రిన్సిపల్ శ్రీజ్యోతి, సమన్వయకర్తలు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, కల్పనా ప్రసంగించారు. మొత్తం 277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. అత్యధికంగా వి.సాహితీ 484 మార్కులు, ఆర్.అద్వైత 483, కె.కావ్యశ్రీ, వి.పశ్వంతి, డి.సైఫ్ అఫ్రిది, టి.తన్వి, ఎస్.హిమవర్షిణి 481 మార్కులు సాధించారని తెలిపారు. మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్‌కి చెందిన 637 మంది పరీక్షలకు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్స్ కె.శ్రీనివాసరెడ్డి, మీనాక్షి విల్సన్ తెలిపారు. అలాగే స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ గోపినాథ్ తెలిపారు. ఎ.హరి సుహాస్ రెడ్డి 486 మార్కులు, బి.జోషిత రెడ్డి 481, ఎం.లిఖిత్ 480, కె.జయంత్ కుమార్ యాదవ్ 474, శ్రీప్రణవి 473, యశశ్వని 472 మార్కులు సాధించారన్నారు. మొత్తం 111 మంది పరీక్షలకు హాజరుకాగా వీరిలో 14 మంది 90 శాతానికిపైగా, 49 మంది 80 శాతానికిపైగా, 73 మంది 70 శాతానికిపైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

కేసీ బండ్ స్థలం కబ్జా

- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు



జొహరాపురం కేసీ కెనాల్ వద్ద కబ్జా అయిన బండ్ స్థలం

కర్నూలు (టౌన్): అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. ఇదే అదునుగా టీడీపీ నేత అనుచరుడు తన పొలం సమీపంలోని కేసీ స్థలాన్ని దర్జాగా కబ్జా చేశాడు. పైగా ఆ స్థలాన్ని అమ్మకానికి పెట్టాడు. కేసీ కెనాల్ బండ్ స్థలం కావడంతో కేసీ కెనాల్ తెగిపోయే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని జొహరాపురం కేసీ కెనాల్ వెంబడి టీడీపీ నేతకు చెందిన పొలం ఉంది. ఈ పొలానికి ఆనుకుని కేసీ కెనాల్‌కు సంబంధించిన బండ్ స్థలం ఉంది. కేసీ కెనాల్‌కు భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఈ కట్ట ఉంటుంది. ఆ స్థలం రహదారి సమీపంలో ఉండడంతో డిమాండ్ ఏర్పడింది. దీంతో టీడీపీ నేత కన్ను పడింది. స్థలాన్ని చదును చేసి అమ్మకానికి పెట్టాడు. ఆక్రమణపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, స్థానికులు కోరుతున్నారు.

విధులు బహిష్కరించిన సెక్యూరిటీ గార్డులు



క్యాజువాలిటీ ఎదుట సెక్యూరిటీ గార్డులు లేకపోవడంతో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం పలువురు సెక్యూరిటీ గార్డులు విధులు బహిష్కరించారు. ఈ మేరకు వారు అధికారుల వద్దకు వెళ్లి తమకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, యాజమాన్యంతో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు నెలలుగా జీతాలు రాకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి జీతాలు వచ్చేలా చూస్తానని అధికారులు వారికి హామీ ఇచ్చి పంపించారు. అనంతరం ఆస్పత్రి సెక్యూరిటీ అధికారులను సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి పిలిచి మాట్లాడారు. ఏజెన్సీ నిర్వాహకునితో మాట్లాడి జీతాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. మూడు, నాలుగు రోజుల్లో జీతాలు వేస్తామని ఏజెన్సీ నిర్వాహకుడు చెప్పారని సెక్యూరిటీ అధికారులు సమాధానమిచ్చారు.